# జన్మోత్సవ సన్మానం

డి.వి. నరసరాజు



ఎవరో ప్రొద్దున్నే ఫోన్ చేశారు!— తమది హైదరాబాద్ అనీ, నాతో మాట్లాడాలనీ, విప్పుడు వీలవుతుందనీ, 'యిప్పుడే వస్తే యింటి దగ్గర వుంటారా?' అనీ అడిగారు.

'వుంటా'నన్నాను. 'వెంటనే బయలుదేరి వస్తా'మన్నారు.

ఎవరో ప్రొడ్యూసర్లయి వుంటారని నిశ్చయించుకున్నాను! లోపలికి వెళ్లి నలుగురికి కాఫీలు సిద్ధంచెయమన్నాను.

పావుగంటలో – యింటిముందు టాక్సీ ఆగింది. టాక్సీదిగి నలుగురు లోపలికి వచ్చారు. తమని తమే పరిచయంచేసుకున్నారు. ఒకరు శర్మ, రెండోవారు సాంబమూర్తి మూడు కృష్ణమూర్తి. నాలుగు రామమూర్తి!

'మా సమాజం పేరు వినేవుంటారు. 'శాశ్వత సన్మాన సమాజం' అన్నాడు శర్మ.

అయితే ప్రొడ్యూసర్లు కాదన్నమాట! నా మొఖంలో కాంతి తగ్గింది. కొంపదీసి చందాకి వచ్చివుంటారు.

కేవలం సన్మానాలకోసమే పెట్టబడిన శాశ్వత సమాజమట వారిది.

రాజకీయ, సాంస్కృతిక కళారంగాలలో అమూల్యమైన సేవ చేసిన వారికి సన్మానాలు చేయడమే వారి సమాజం ప్రధానోద్దేశమట! ఆ సమాజానికి వీరు అధ్యక్ష, కార్యదర్శులట!

వారి లెటర్ హెడ్ చేతికిచ్చి చూడమన్నారు. పాతిక ముప్పయి పేర్లున్నయ్! గౌరవాధ్యక్షులు, అధ్యక్షులు, సలహాదార్లు, అధ్యక్షులు, కార్యదర్శులు కోశాధికారి. కమిటీ సభ్యులు వగైరా!

అందరూ ప్రముఖులే! మంత్రులూ, జడ్జీలు, ఫిలిం ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు, రచయితలు, రచయిత్రులు వగైరా—

వారి సమాజం యిదివరలో చేసిన సన్మానాల తాలుకు ఫోటోల 'ఆల్బం' చేతికిచ్చారు.

తీసి చూశాను!

అబ్బో! చాల పెద్ద పెద్ద వారికే సన్మానాలు చేశారు. ప్రతి సన్మానంలో నూ మంత్రులూ, జడ్జీలు— పుర ప్రముఖులు పాల్గొన్నారు!

ఆ ఫోటోలు చూస్తున్నంత సేపూ చందా ఎంత యివ్వవలసి వుంటుందా అని లోలోపల పీకుతూనే వుంది.

'ఇంతకూ యిప్పుడు ఎవరికి చేయబోతున్నారు సన్మానం?' అని అడిగేశాను!

'మీకే' అన్నారు శర్మ!

ముందు గుండె గతుక్కుమంది! వెంటనే ఒళ్ళు పులకరించింది. వాళ్ల ముఖాలలోకి చూశాను! కళాభిమానం, కళాసేవ వాళ్ళ ముఖంలో కొట్టవచ్చినట్టు కనబడింది!

పొంగుతున్న సంతోషాన్ని పొంగనివ్వకుండా ఆపి, 'నా కెందుకండీ సన్మానం? నే వేం చేశాను గనక' అన్నాను. అప్పుడు నా ముఖంలో ఎక్స్‌ప్రెషన్ ఎలా వుందో!

'అదేమన్నమాట! మీరు సినీ రంగానికి ఎంత సేవ చేశారు? మాకు తెలియదా? మిమ్మల్ని సన్మానించేది మీకోసం గాదు, మా కోసం! తెలుగు ప్రజల కోసం! తెలుగు కళ కోసం' అన్నారు శర్మ!

'వుండండి, ఒక్క నిముషం' అని లోనికి వెళ్ళాను. 'ఒట్టి కాఫీ కాదు. నాలుగు పెస

రమ్ము గూడ వెయ్యమని' అర్థరిచ్చి వచ్చాను.

'మీరు సినీ రంగంలో ప్రవేశించి ఈ సెప్టెంబర్ 16 కు సరిగ్గా పాతికేళ్ళు! కదండీ?' అన్నారు శర్మ!

ఆశ్చర్యంతో 'అవునండీ' అన్నాను!

'అందుకే, మీ సినీ జీవిత రజితోత్సవం సందర్భంగా మిమ్మల్ని సన్మానించ దలిచాం' అన్నాడు సాంబమూర్తి.

వెంటనే కృష్ణమూర్తి అందుకున్నాడు.

"మీరు 1951 లో వాహినీ సంస్థలో ప్రవేశించారు మీ మొదటి చిత్రం 'పెద్ద మనుషులు!' దానికి ఆ ఏడు ఉత్తమ చిత్రంగా రజత పతకం కేంద్ర ప్రభుత్వం బహూకరించింది.

మీ రెండో చిత్రం 'దొంగరాముడు' అది అన్నపూర్ణావారి మొదటి చిత్రం.

యిప్పటికి మీరు దాదాపు 60 చిత్రాలకు రచన చేశారు.

నేను నిర్ఘాంతపోయి, నిశ్చేష్టుడనైనాను.

'నా సంగతి నా కంటె మీకే ఎక్కువ తెలుసునండీ' అన్నాను - ఆయన విజ్ఞానాన్ని మెచ్చుకుంటూ!

"మీ సంగతే కాదండీ! కళారంగంలో ప్రముఖులను గురించి - రెసెర్చిచేసి రికార్డులు తయారుచేస్తాం!' అన్నాడు గర్వంగా శర్మ!

వాళ్ల కళాభిరుచికి, కార్యదక్షతకు ముగ్ధుడనైనాను.

ఈసారి రామమూర్తి అందుకొన్నాడు.

"మీరు సినిమాలకి రాకముందు నాటకాలు వ్రాసేవారు. మీ నాటకాలకు నాటక కళా పరిషత్తు పోటీలలో బహుమతులు వచ్చాయి. మీకు బి. ఎ. లో తెలుగులో ఫస్ట్‌క్లాసు వచ్చింది! - మద్రాసు యూనివర్శిటీవారి బంగారుపతకం బహూకరించ బడింది."

అబ్బ! ఎంత పరిశోధన చేశారు వీళ్లు! అసలు వీళ్లకి సన్మానం చేయాలి!-

"అంతర్జాతీయ కథల పోటీలో మీ కథకి రెండో బహుమతి వచ్చింది! కదూ!" అన్నాడు సాంబమూర్తి!

యిబ్బందిలో పడ్డాను!

"అది నాకు కాదండీ! పాలగుమ్మి పద్మ రాజుగారికి" అన్నాను.

'ఓహో' అని కాస్త సర్దుకున్నాడు సాంబమూర్తి!

"మీరు కొన్నాళ్లు అడ్వకేట్ జనరల్‌గా పని చేశారు గదూ?" అన్నాడు రామమూర్తి!

"లేదండీ! ఆయన దువ్వూరి నరసరాజ గారు? ఆయన యివ్వాడు లేరు." అన్నాను

"మరి మీరు?"

"నేను వున్నాను"-

"అదిగాదు -మీయింటిపేరు...

"దువ్వూరి గాదు! దాట్ల!"-

అందరం కాస్త యిబ్బందిలో పడ్డాం! బండి పట్టాలు తప్పుతోంది.

"మీరింతవరకూ ఎన్నిసినిమాలు తీశారు?' అని అడిగాడు శర్మ!

"నేను తీయలేదండి"

"మరి డి. వి. యస్. ప్రొడక్షన్స్ మీదిగదూ?"

'కాదండి ఆయన డి.వి.యస్. రాజుగారు,'

"ఓహో! డి. వి. యస్. అంటే డి. వి. యస్. అనుకున్నాం!"

"యిందులో - నేను ఎవరను కొని వీళ్లు వచ్చారో! యింత రిసెర్చి చేసిన వాళ్లు పొరబడతారా? నాకోసమే వచ్చి వుంటారు?' అని సమాధాన పరచుకొన్నాను.'

"ఎందుకయినా మంచిది మీజీవిత విశేషాల్ని వివరంగా మీరే వ్రాసి యివ్వండి మీకవర్ ఫోటోతో సహా - ఒక చిన్న పుస్తకంగా ప్రచురిస్తాం"

'ఎందుకండీ! నాకసలు సన్మానాలంటేనే..' నీళ్లు నమిలాను.

'మీకు యిలాంటివి యిష్టం లేదనికూడ మాకు తెలుసు! అందుకే స్వయంగా వచ్చాం మాట్లాడడానికి! సన్మానాలు మీరు చేయమంటేచేస్తామా? అది మా విధ్యుక్త ధర్మం' మిమ్మల్ని సన్మానిస్తె - మమ్మల్ని మేమే సన్మానించు కున్నట్లు! మీరు కాదన్నా-మేము సన్మానం చేసి తీరుతాం"అన్నారు శర్మ.

అతని మొహంలోనూ, మాటల్లోనూ, ఎంతో సిన్సియారిటీ కనిపించింది! నా మాటకు కొంత బాధ గూడా పడ్డట్టున్నారు పాపం! కళాభిమానుల మనసులు అంత సున్నితం కాబోలు అనుకున్నాను

"సన్మానసభకి ముందు వూరేగింపు వుంటుంది" అన్నాడు సాంబమూర్తి సీరియస్‌గా!

"ఎందుకండీ..." అనబోయాను.

సాంబమూర్తి కోపంగా "మీ యిష్టాయిష్టాలతో మాకు పనిలేదు! మా ఆచారం ప్రకారం జరగవలసిందే' అని గద్దించారు.

ఆ గద్దింపులో ఎంతో ఆప్యాయత వుంది!

"వూరేగింపుకి కారు ఏర్పాటు చేయమంటారా?"

"కారా?..." సందేహంగా!...

"ఏదైనా కొత్త రకం! నావెల్టీగా వుంటే మంచిది!"

"గుర్రం అయితే?" రామమూర్తి సూచన!

శర్మ మొహం వికసించింది- "కాదు! - బ్రహ్మాండమైన నావల్టీ! హైదరాబాద్‌లో ప్రస్తుతం ఒక సర్కస్ కంపెనీ ఉంది! వాళ్లతో మాట్లాడి- ఒంటెని ఏర్పాటు చేద్దాం!" అన్నాడు.

అవును నావల్టీగా ఉంటుందని నాకూ అనిపించింది "మీ యిష్టం" అన్నాను.

చటుక్కున కృష్ణమూర్తి ప్రశ్న!

"రాజుగారూ! తెలుగు నటీమణుల్లో మీకు అభిమాన పాత్రులైన వాళ్లు ఎవరు?

క్షణం ఆలోచించి "చాల మంది వున్నారు వాణిశ్రీ, సావిత్రి, జమున, అంజలీదేవి, భానుమతి, కన్నాంబ, కాంచనమాల..." అన్నాను.

"వీరిలో మీకు అత్యంత అభిమాన పాత్రులు ఎవరు?"

"చెప్పడం కష్టం!"

"అయితే ఒక పని చేద్దాం" వాళ్లందరి పేర్లు వేరు వేరు చీటీల మీద వ్రాసి - లాటరీ వేద్దాం! ఒకచీటీ తీద్దాం! ఆ చీటీ మీద ఎవరిపేరు వస్తే ఆమె చేత మీకు సన్మానం చేయిస్తాం."

వెంటనే నేను "అయితే నేను చెప్పిన లిస్టులో కన్నాంబగారి పేరు తీసెయ్యండి" అన్నాను.

"ఏం?" అన్నాడు సాంబమూర్తి!

"ఎందుకు పాపం ఆమెను శ్రమ పెట్టటం?"

"అవును" అని ఒప్పుకున్నాడు ఆయన!

"సరే! సన్మాన సభకి అధ్యక్షత వహించడానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులలో ఎవరిని పిలవమంటారు?"

"వాళ్లలో నాకు విరోధులు ఎవరూ లేరు! ఎవరిని పిలిచినా నాకు యిష్టమే" అన్నాను- అజాత శత్రువులాగ.

"సర్! ఆ విషయాలు మాకు వదిలేయండి. కనీసం ముగ్గురు మంత్రులు - యిద్దరు జడ్జీలు సభలో పాల్గొనే ఏర్పాటు చేస్తాం! యింకా ఏమిటి మాట్లాడాలను కున్నాం..." అని దీర్ఘంగా ఆలోచించి

"ఆ! అసలు ముఖ్యవిషయం - మీకు బిరుదు!"

"అవును మీకు బిరుదు యివ్వాలని నిర్ణయించాము. మీకు ఏం బిరుదు కావాలి" అని అడిగాడు చిరునవ్వుతో సాంబమూర్తి.

"మీ యిష్టం" అన్నాను ఎంతో వినయంగానూ కించిత్ సిగ్గుతోనూ!

"నాదొక సూచన!" అన్నాడు కృష్ణమూర్తి!

"మీ రచనలు ప్రధానంగా హాస్యప్రదమైనవి గనక మీకు 'హాస్యప్రద బ్రహ్మ' అని బిరుదు...

"వద్దండి! అది వద్దండి" అని ఆదుర్దాగా ఆవేశాను— కాస్త బతిమాలుతున్న ధ్వనితో!

"పోనీ "హాస్యప్రద చక్రవర్తి?"

"అదీ వద్దండి! బిరుదు ఏదిచ్చినా కాస్త పెద్ద వాళ్లను పండితులను సంప్రదించి నిర్ణయించండి" అన్నాను ప్రాధేయపూర్వకంగా!

'సరే'నని వాళ్ళు నలుగురూ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు.

నా పరిస్థితి ఏమీ బాగులేదు! ఈసన్మానం ఎలా జరుగుతుందో. రసాభాస అవుతుందో అని భయంలో పడ్డాను!

పోనీ వద్దని ఖచ్చితంగా చెప్పడానికి మనసు ఒప్పుకోవడంలేదు!

యింటికి వచ్చి 'సన్మానం చేస్తా'మని ఎవరు అంటారు? ఎంతో కళాభిమానం గల వాళ్లు కాకపోతే.

కాస్త ధైర్యం పుంజుకుని అన్నాను!

"అయ్యా! మీ కళాభిమానానికి, కళా సేవకి తెలుగు దేశం ఎంతో ఋణపడి వుంటుంది యిక నా సంగతి చెప్పనే అక్కర్లేదు! ఈ జన్మలో మీ ఋణం తీర్చుకోలేను!

కాని నేను మనవి చేయవలసినవి రెండు మూడు విషయాలున్నవి!

సన్మానసభలో నన్ను గురించి మాట్లాడే వక్తలు నన్ను గురించిగాని, సినిమాలను గురించిగాని కాస్తో కూస్తో తెలిసినవాళ్లుగా చూడండి!

నన్నూ పద్మరాజుగారిని, పాపం దువ్వూరి నరసరాజుగారినీ, డి. వి ఎస్. రాజుగారిని కలిపి కొడితే నేను కాస్త యిబ్బంది పడవలసి వస్తుంది" అన్నాను గాద్గదంతో!

"ఆజ్ఞాగ్రత్తలు తీసుకుంటాం లెండి! మీజీవిత సంగ్రహం ముద్రించి వాళ్లకి యిస్తాం ముందుగానే!"

# రజతోత్సవ సన్మానం

"వాళ్ల కిలాంటివి అలవాటే లెండి" అని నన్ను సముదాయించాడు శర్మ:

సాంబమూర్తి అదోలాగ నవ్వి అన్నాడు—

"మీకు యివి అలవాటు లేక ఏవో భయాలు, సందేహాలు పెట్టుకుంటున్నారు! మా సంగతి మీకు తెలీదు! యిటువంటివని నెలకు నాలుగు సన్మానాలు చేస్తుంటాం."—

నిజమేననిపించింది! వాళ్ళు అనుభవజ్ఞులు:

ఎంతో వినయంగా అన్నాను— "మీరు నాపట్ల చూపుతున్న ఆదరాభిమానాలకు, ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలియటంలేదు—" కళ్లలో నిజంగా నీళ్లు తిరిగాయి

> **మొలకలెత్తిన 2 వేల ఏళ్ళ నాటి విత్తనాలు**
>
> అర్జెంటైనాలో రెండువేల ఏళ్ల క్రితం నాటి మూడు విత్తనాలను ఇక్కడి చారిత్రక మ్యూజియంలోని శాస్త్రజ్ఞులు విత్తి మొలకెత్తించినట్లు తెలుస్తున్నది.
>
> ఈ విత్తనాలు ఎనిమిదేళ్ల క్రితం ఒక గుహలో లభించాయి. సీలు వేసిన ఒక డబ్బాలో ఇవి భద్రపరచబడి వున్నాయి. వాటిలో మూడింటిని జాగత్తగా ఏరి భూమిలో పాతి పెట్టారు. అవి తొమ్మిది రోజుల తర్వాత 18 మి. మి మొలకలెత్తాయి

"ఒక్క రెండువేల రూపాయలివ్వండి' అన్నాడు శర్మ! తకీమని!—

పిడుగు పడ్డట్టయింది!

అప్రయత్నంగా - 'రెండువేలా?' అనేశాను పొరబోయి - దగ్గు వచ్చింది!

'ముందు ఏవో చిల్లర ఖర్చులుంటాయి గదండీ మళ్ళీ ఆడబ్బు మీకు వచ్చేస్తుంది! సావనీర్ ప్రింటుచేసి డబ్బు వసూలుచేస్తాంగా అందులోంచి తీసి యిచ్చేస్తాం!" అన్నాడు సాంబమూర్తి బుజ్జగిస్తూ!

నాకు దగ్గు తగ్గలేదు!

"వుండండి! మంచినీళ్లు తాగివస్తా" అని దగ్గుతూ లోనికి వెళ్ళాను.

"పెసరట్లు పంపమంటారా?" అనిఅడిగింది మా ఆవిడ!

"అక్కర్లేదు! మంచినీళ్లివ్వమని" మంచి నీళ్లు తాగి-తమాయించుకుని -

"చెక్కుబుక్కు ఎక్కడుంది?" అని అడిగాను!

"మీ టేబిల్ డ్రాయరులో వుంది. ఎందుకు?"

"వాళ్ళకి చెక్కు వ్రాసియివ్వాలి" అని మళ్ళీవాళ్ల దగ్గరికి వెళ్ళాను దగ్గు ఎలాగో దిగమింగుకున్నాను కాని బుర్ర ఏమీ పని చేయడంలేదు

డ్రాయరులోంచి చెక్కు బుక్కు తీసి రెండువేల రూపాయలకి చెక్కు వ్రాశాను - వణుకుతున్న చేతులతో శర్మకి యిచ్చాను.

శర్మ చాల సిన్సియర్‌గా 'థాంక్స్' చెప్పాడు

"సెప్టెంబర్ 16 సన్మానం! వ్యవధి లేదు! చక చక ఏర్పాట్లు చేయాలి! యివాళే వెళ్లిపోతాం!" అన్నాడు సాంబమూర్తి!

నలుగురూ ఏకగ్రీవంగా—

"సెలవు" అని విడి విడిగా నమస్కరించి వెళ్ళిపోయారు!

నేను అలాగే నిలబడిపోయాను.

మా ఆవిడ వచ్చింది.

"ఎంత కిచ్చారు చెక్కు?"

"రెండువేలు"

"రెండువేలా? డబ్బిచ్చి సన్మానం చేయించుకుంటారా? యింతకంటె సిగ్గు చేటు వుందా?"

"ఏం చెయ్యమంటావు! డబ్బు సంగతి వాళ్ళు ముందు చెప్పలేదు, సన్మానానికి అంగీకరించి తీరా డబ్బు అడిగిన తరువాత 'వద్దంటే' ఏమనుకుంటారు?"

"అందుకని డబ్బు ఎదురిచ్చి సన్మానం జేయించుకుంటారా? అటువంటి సన్మానాలు లేకపోతే ఎవడేడిశాడు?"

నా మొఖంలోకి కాస్త చిరునవ్వు తొంగి చూచింది!

"పాతికేళ్ళనుంచి సినిమాల్లో పనిచేస్తున్నాను. మరీ అంత తెలివి తక్కువ దద్దమ్మ కట్టేయకు మరి!"

"అంటే?..."...

"నా బ్యాంక్ అక్కవుంటులో డబ్బులేదు"

అందువల్ల—

ఆ చెక్కు చెల్లదు!

ఈ సన్మానం జరగదు!!"